



# ‘ఐయామ్ గేమ్’ విడుదల వాయిదా




మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్, హిట్ చిత్రాల దర్శకుడు నహాస్ హిదాయత్ కాంబినేషన్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిన ఫాంటసీ థ్రిల్లర్ మూవీ ‘ఐయామ్ గేమ్’. ఇందులో దుల్కర్ సరసన కయాదు లోహర్ హీరోయిన్‌గా నటించగా, ఆంటోనీ వర్గీస్, ప్రముఖ దర్శకుడు మిస్కిన్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఇప్పటికే భారీ అంచనాలు నెలకొల్పిన ఈ సినిమా తమిళ వెర్షన్ థియేటర్లలోకి వచ్చేసింది. ఇక తెలుగు వెర్షన్ ఈరోజే సెప్టెంబర్ 3న గ్రాండ్‌గా విడుదల కావాల్సి ఉండగా, ఊహించని విధంగా చివరి నిమిషంలో ఆగిపోవడం అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది. దీంతో పెద్ద ఎత్తున పలు పోస్టులు పెడుతూ మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో.. తాజాగా, ఈ సడన్ బ్రేక్‌పై స్పందించిన చిత్ర యూనిట్, సోషల్ మీడియా ద్వారా కీలక నోట్ విడుదల చేసింది.

కొన్ని అనివార్యమైన సాంకేతిక కారణాల వల్లే తెలుగు వెర్షన్ విడుదలను తాత్కాలికంగా వాయిదా వేయాల్సి వచ్చిందని నిర్మాతలు తెలిపారు. అయితే మలయాళ వెర్షన్ మాత్రం ముందే అనుకున్నట్లుగా థియేటర్లలో విడుదలైందని, అక్కడ అన్ని షోలు యథాతథంగా ప్రదర్శించబడుతూ ప్రేక్షకులను అలరిస్తున్నాయని స్పష్టం చేశారు. తెలుగు ప్రేక్షకులకు త్వరలోనే కొత్త విడుదల తేదీని వెల్లడిస్తామని, వీలైనంత త్వరగా సినిమాను అందుబాటులోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నామని మూవీ టీమ్ పేర్కొంది. అనుకోకుండా జరిగిన ఈ ఆలస్యానికి, తెలుగు ప్రేక్షకులకు కలిగిన అసౌకర్యానికి తీవ్రంగా చింతిస్తున్నామని ప్రకటనలో రాసుకొచ్చారు. దుల్కర్ సల్మాన్‌కు తెలుగులో మంచి మార్కెట్ ఉన్న నేపథ్యంలో, ఈ సాంకేతిక సమస్యలు త్వరగా తొలగిపోయి సినిమా ఎప్పుడు థియేటర్లలోకి వస్తుందా అని ఆయన ఫ్యాన్స్ ఎదురుచూస్తున్నారు.



# ‘టాక్సిక్’ మళ్లీ థియేటర్లలోకి!

రాకింగ్ స్టార్ యశ్ హీరోగా నటించిన ‘టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్’ సినిమా మరోసారి థియేటర్లలో సందడి చేయడానికి సిద్ధమైంది. ఇప్పటికే కన్నడ, తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో విడుదలైన ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామా.. ఇప్పుడు ఇంగ్లీష్ వెర్షన్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది. సెప్టెంబర్ 4 నుంచి ఎంపిక చేసిన ఇండియన్ థియేటర్లలో ఈ ఇంగ్లీష్ వెర్షన్‌ను ప్రదర్శించనున్నారని మేకర్స్ అఫీషియల్‌గా అనౌన్స్ చేశారు. యశ్‌తో పాటు నయనతార, కియారా అద్వానీ, హ్యూమా ఖురేషి, తారా సుతారియా తదితరులు కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాకు గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహించారు. సినిమా షూటింగ్‌ను కన్నడతో పాటు ఇంగ్లీష్‌లోనూ చిత్రీకరించారు. ఇప్పటికే విడుదలైన ఇండియన్ లాంగ్వేజ్ వెర్షన్లతో పోలిస్తే ఇంగ్లీష్ వెర్షన్‌ను కాస్త ట్రిమ్ చేసి ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నారని సమాచారం.

తాజా సమాచారం ప్రకారం.. ఇంగ్లీష్ వెర్షన్ రన్‌టైమ్ సుమారు 2 గంటల 57 నిమిషాలుగా ఉండనుంది. అంటే ఇప్పటికే విడుదలైన వెర్షన్ల కంటే దాదాపు 18 నిమిషాలు తక్కువగా ఉండనుంది. ఇక ‘టాక్సిక్’ ఇప్పటికే బాక్సాఫీస్ వద్ద భారీ ఓపెనింగ్‌ను నమోదు చేసింది. విడుదలకు ముందే ఈ సినిమాకు అడ్వాన్స్ బుకింగ్స్‌లో మంచి రెస్పాన్స్ కనిపించింది. ఆగస్టు 25 నాటికి దేశవ్యాప్తంగా 9 లక్షలకు పైగా టికెట్లు అడ్వాన్స్‌గా అమ్ముడైనట్లు అప్పటి నివేదికలు వెల్లడించాయి. ఆగస్టు 26న ఇండియన్ లాంగ్వేజ్ వెర్షన్లతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ‘టాక్సిక్’.. ఇక ఇంగ్లీష్ వెర్షన్‌తో మరింత మంది ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ అయిన ఈ సినిమాకు ఇంగ్లీష్ వెర్షన్ కూడా అందుబాటులోకి రావడంతో యశ్ అభిమానుల్లో మరోసారి ఆసక్తి పెరిగింది. సెప్టెంబర్ 4 నుంచి ఇంగ్లీష్ వెర్షన్‌కు ఎలాంటి స్పందన వస్తుందో చూడాలి.

# సినిమాలకు త్రిష గుడ్‌బై?



కోలీవుడ్‌లో రెండు దశాబ్దాలకు పైగా స్టార్ హీరోయిన్‌గా తనదైన ముద్ర వేసుకున్న నటి త్రిష కృష్ణన్ మరోసారి వార్తల్లో నిలిచారు. ప్రస్తుతం లండన్ నేపథ్యంలో తెరకెక్కుతున్న సరికొత్త సైకలాజికల్ హారర్ థ్రిల్లర్‌లో నటిస్తున్న ఆమె.. ఈ సినిమా కారణంగా కాకుండా తన సినీ కెరీర్‌కు సంబంధించి వినిపిస్తున్న వార్తలతో హాట్ టాపిక్‌గా మారారు. త్రిష నటిస్తున్న ఈ సినిమా ఆమెకు చివరి చిత్రం కాబోతుందా? ఇక సినిమాలకు పూర్తిగా గుడ్‌బై చెప్పి రాజకీయాల్లోకి అడుగుపెట్టబోతున్నారా? అనే చర్చలు ప్రస్తుతం కోలీవుడ్ వర్గాల్లో జోరుగా సాగుతున్నాయి. అయితే ఈ విషయంపై ఇప్పటివరకు త్రిష నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు.

త్రిష ప్రస్తుతం లండన్‌లో ఓ సైకలాజికల్ హారర్ థ్రిల్లర్ షూటింగ్‌లో పాల్గొంటున్నారు. బాలీవుడ్‌లో ‘ఎయిర్‌లిఫ్ట్’, ‘చెఫ్’, ‘పిప్పా’ వంటి విభిన్నమైన చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడు రాజా కృష్ణ మీనన్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. పనోరమా స్టూడియోస్ సంస్థ.. లోకోమోటివ్ గ్లోబల్, ఫ్యూజన్ ఫ్లిక్స్ సంస్థలతో కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. కుమార్ మంగత్ పాఠక్, అభిషేక్ పాఠక్ ఈ ప్రాజెక్ట్ ద్వారా తొలిసారి తమిళ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెడుతున్నారు. ఈ సినిమాలో త్రిషతో పాటు సీనియర్ నటి రాధిక శరత్‌కుమార్, నేషనల్ అవార్డు విజేత అపర్ణ బాలమురళి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ముగ్గురు ప్రతిభావంతమైన నటీమణులు ఒకే సినిమాలో కనిపించనుండటంతో ఈ ప్రాజెక్టుపై ఆసక్తి పెరిగింది.

ఈ సినిమా ప్రారంభమైనప్పటి నుంచి త్రిషకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన ప్రచారం కోలీవుడ్‌లో వినిపిస్తోంది. ప్రస్తుతం చేస్తున్న సినిమా పూర్తయిన తర్వాత త్రిష సినిమాలకు బ్రేక్ ఇవ్వబోతున్నారనే వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. అంతేకాదు.. పూర్తిగా సినిమాలకు గుడ్‌బై చెప్పి రాజకీయాల్లోకి ప్రవేశించే ఆలోచనలో ఆమె ఉన్నారనే ప్రచారం కూడా జరుగుతోంది. దీంతో లండన్‌లో జరుగుతున్న ఈ సినిమా త్రిష కెరీర్‌లో చివరి చిత్రంగా మిగిలిపోతుందా? అనే చర్చ మొదలైంది. అయితే ఇవన్నీ ప్రస్తుతం ప్రచారంలో ఉన్న వార్తలు, ఊహాగానాలు మాత్రమే. త్రిష నుంచి దీనిపై ఎలాంటి అధికారిక ధృవీకరణ రాలేదు. త్రిషకు తమిళ స్టార్ హీరో విజయ్‌తో ఉన్నరిలేషన్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. వీరిద్దరూ కలిసి నటించిన సినిమాలకు కోలీవుడ్‌లో మంచి క్రేజ్ ఉంది. తెరపై వీరి కెమిస్ట్రీకి కూడా భారీగా అభిమానులు ఉన్నారు. విజయ్ ఇప్పటికే రాజకీయాల్లోకి అడుగుపెట్టడంతో.. ఇప్పుడు త్రిష కూడా పాలిటిక్స్‌లోకి వస్తారనే ప్రచారం రావడం ఆసక్తిని పెంచుతోంది.


# ‘బెత్లెహాం’కు థియేటర్ల కష్టాలు!

నివిన్ పౌలీ హీరోగా మమిత బైజు హీరోయిన్ గా వచ్చిన మలయాళ బ్లాక్ బస్టర్ బెత్లెహం కుడుంబ యూనిట్. కేరళంలో ఓనమ్ కానుకగా రిలీజైన ఈ సినిమా ఇండస్ట్రీ హిట్ దిశగా వెళ్తోంది. ఈ రోజు ‘బెత్లెహం కుడుంబ యూనిట్’ తెలుగు విడుదల కావాల్సి ఉంది. అయితే ఇప్పుడు ఈ ఈసినిమాకు ఊహించని చిక్కులు ఎదురయ్యాయి. మలయాళంలో మంచి విజయం సాధించిన ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు పూర్తి చేసినప్పటికీ, ప్రస్తుతం థియేట్రికల్ స్క్రీనింగ్ విషయంలో డిస్ట్రిబ్యూటర్లకు గట్టి షాక్ తగిలింది.

ఈ సినిమా ఓటీటీ స్ట్రీమింగ్ విండో (తక్కువ సమయంలోనే ఓటీటీలోకి రావడం) కారణాన్ని చూపుతూ ప్రముఖ మల్టీప్లెక్స్ నెట్‌వర్క్‌లు తమ స్క్రీన్‌లలో ఈ చిత్రాన్ని ప్రదర్శించడానికి తిరస్కరించాయి. థియేటర్లలో విడుదలైన కొన్ని వారాల్లోనే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలోకి వచ్చే సినిమాలకు మల్టీప్లెక్స్‌లు స్క్రీన్లు కేటాయించకూడదనే నిబంధనను ఈ చిత్రానికి వర్తింపజేశారు. దీనివల్ల ఈ తెలుగు వెర్షన్‌కు ప్రముఖ మల్టీప్లెక్స్ థియేటర్ల మద్దతు లభించలేదు. ఈ పరిణామాల కారణంగా ‘బెత్లెహం కుడుంబ యూనిట్’ తెలుగు వెర్షన్ కేవలం సింగిల్ స్క్రీన్ థియేటర్లలో మాత్రమే ప్రదర్శించబడనుంది. కేరళం బయట ఫహద్, నివిన్ పౌలి వంటి ఇద్దరు స్టార్ హీరోలు ఎంతో ఆసక్తితో ప్రమోషన్స్ నిర్వహిస్తున్న ఏకైక ప్రాజెక్ట్ కావడంతో, మల్టీప్లెక్స్‌లు దూరం కావడం కొంత నిరాశపరిచే విషయమే. అయినప్పటికీ సింగిల్ స్క్రీన్స్ వేదికగా ఈ చిత్రం ఏ స్థాయిలో ప్రేక్షకుల ఆదరణ పొందుతుందో వేచి చూడాలి.



# ‘ఈఎంఐ’ తిప్పలు నవ్వులే నవ్వులు!



ప్రతి మధ్యతరగతి మనిషి జీవితంలో ‘ఈఎంఐ’ అనే పదం వినపడగానే గుండెల్లో రైళ్లు పరిగెడతాయి. ప్రతీ నెలా వచ్చే ఆ ఆర్థిక భారం, టెన్షన్ ఎవరికీ రాకూడదనే అంటారు. అయితే, సరిగ్గా ఇదే కాన్సెప్ట్‌ను ఎంచుకుని, ప్రేక్షకులకు కడుపుబ్బా నవ్వులు పంచేందుకు ఓ సరికొత్త ఎంటర్‌టైనర్ సిద్ధమవుతోంది. సక్సెస్‌ఫుల్ మూవీ ‘ది గ్రేట్ ప్రీ-వెడ్డింగ్ షో’ తెరకెక్కించిన 7 PM ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. నూతన నటీనటులు, సాంకేతిక నిపుణులను ప్రోత్సహిస్తూ రూపొందుతున్న ఈ సినిమాకు నిఖిల్ కువ్వరపు దర్శకత్వం వహిస్తున్నారు. ‘లాల్ సలామ్’, ‘హాస్టల్ డేస్’ వంటి ప్రాజెక్ట్‌లతో గుర్తింపు తెచ్చుకున్న దారహాస్ మాతురు హీరోగా నటిస్తుండగా, ‘లిటిల్ హార్ట్స్’ ఫేమ్ శైలజ నాయికగా అలరించనున్నారు.

తాజాగా విడుదలైన ఈ సినిమా టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈఎంఐల వల్ల మధ్యతరగతి ప్రజలు పడే పాట్లు, ఆ తాలూకు ఫన్నీ సిట్యుయేషన్స్‌ను ఎంతో రియాలిస్టిక్‌గా, వినోదాత్మకంగా టీజర్‌లో చూపించారు.